క్లుప్తంగా

ధర్నా విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: అక్టోబర్ 7వ తేదీన విజయవాడలో ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని శ్రీకాకుళం ప్యాఫ్టో నాయకులు జి.రమణ పిలుపునిచ్చారు. ఎల్.ఎన్.పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు ముక్తి కల్పించాలని కోరారు. 12వ పీఆర్సీ, మధ్యంతరభృతి, కారుణ్య నియమకాలు, మెమో 57 అమలు, పెండింగ్ బకాయిలు, డీఏలు విడుదల, తదితర సమస్యల సాధన కోసం ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సైన్స్, మ్యాథ్స్ కిట్లు అందజేత



ఉపాధ్యాయులకు కిట్లు అందజేస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించిన కిట్లు ఆయా పాఠశాలలకు అందజేసినట్లు ఎంఈఓ కె.రాంబాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా బోధించేందుకు కిట్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

పుస్తకావిష్కరణ



గణిత దీప్తి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

పాతపట్నం: మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర గణిత సంఘం రూపొందించిన గణిత దీప్తి పుస్తకాన్ని హెచ్ఎం బి.సింహాచలం శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల గణిత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఆర్.మధుసూదనరావు మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గణిత దీప్తి ఉపయోగపడుతుందన్నారు. ఈ పుస్తకాలను పదో తరగతి విద్యార్థులకు గణిత ఉపాధ్యాయులు మధు, లండ కేశవరావు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మీనారాయణ, ఎ.అప్పలస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యాన్ల వితరణ



హెచ్ఎంకు ఫ్యాన్లు అందజేస్తున్న లైన్స్ క్లబ్ ప్రతినిధులు

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పొందూరు లయన్స్ క్లబ్ సుమారు రూ.25 వేలు విలువ చేసే 10 ఫ్యాన్లను వితరణగా అందించింది. పాఠశాలలో కొన్ని తరగతి గదులకు ఫ్యాన్లు కొరత విషయాన్ని ఉపాధ్యాయులు లయన్స్ క్లబ్ దృష్టికి తీసుకువెళ్లడంతో హెచ్ఎం వాగ్దేవికి శనివారం ఫ్యాన్లు అందించారు. క్లబ్ ప్రతినిధులు యర్రా మల్లిబాబు, సతీష్, పి.దివాకర్, సూర్యనారాయణ, విజయకుమార్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల పరిశీలన



తర్లిలో రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి

సారవకోట: మండలంలోని సవరబొంతు, తర్లి ఆశ్రమ పాఠశాలలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయదేవి శనివారం సందర్శించారు. పాఠశాలల పరిసరాలు, తరగతి, భోజనపు గదులను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి గిరిజన విద్యార్థులు ఆశ్రమ పాఠశాలల్లో చేరి చదువుకుంటున్నారని, వారి ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. సవరబొంతు ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సాయిబాబా శత వసంత జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫకీర్‌సాహెబ్‌పేటకు చెందిన దివ్యాంగుడు బి.ప్రవీణ్‌కుమార్‌కు వీల్ చైర్ అవసరం కాగా.. తండ్రికి జిల్లా సత్యసాయి సేవా సంస్థల తరపున వీల్‌చైర్‌ను జిల్లా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పి.తాతయ్యలు అందజేశారు. సత్యసాయి సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్థలం

ఆక్రమణ..!



అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ కంచె వేసిన ప్రైవేట్ వ్యక్తులు

- భవనం చుట్టూ కంచె ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు

మెళియాపుట్టి: గత పాతికేళ్లుగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న పక్కా ప్రభుత్వ భవనం తమదే అంటూ కొంతమంది ఏకంగా ఆక్రమించేశారు. మర్రిపాడు-కె పంచాయతీ సవర మురికింటిభద్రలో పలాస మండలం కంబిరిగాం గ్రామానికి చెందిన దువ్వాడ పరశురాం చౌదరి అనే వ్యక్తి పాఠశాల భవనం నిర్మించడానికి స్థలం విరాళంగా ఇచ్చారు. అప్పట్లో అక్కడ డీపీఈపీ (డిస్ట్రిక్ట్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం) నిధులతో అప్పటి ప్రభుత్వం పక్కా భవనాన్ని నిర్మించింది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో అంగన్‌వాడీ భవనంగా మార్చివేసి వినియోగిస్తున్నారు. ఇక్కడ మురికింటిభద్రకు చెందిన 15 మంది పిల్లలు, ఇద్దరు బాలింతలు, సవర మురికింటిభద్ర మినీ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన ఏడుగురు పిల్లలున్నారు. అంతాబాగానే ఉంది.. ఇక్కడ వింతేముంది అనుకుంటే పొరపాటే. ఇప్పుడే చిక్కొచ్చి పడింది. 25 ఏళ్ల తర్వాత పలువురు వ్యక్తులు స్థలం తమదని ఆ భవనం చుట్టూ కంచె వేశారు. అక్కడ నూతన అంగన్‌వాడీ భవనం నిర్మాణంలో ఉండటంతో ఏదైనా ఇబ్బంది జరిగితే పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని దీనిపై అధికారులు దృష్టి సారించాలని, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా పరిధిలో లేదు



ఈ సమస్య మా పరిధిలో లేదు. రెవెన్యూ అధికారులే సమస్య పరిష్కరించాల్సి ఉంది. నేను వెళ్లి కేంద్రాన్ని పరిశీలించాను. కంచె వేసి ఉంది. పిల్లల్ని ఇబ్బంది పెట్టొద్దని చెప్పాను. రెవెన్యూ అధికారుల దృష్టిలోకి ఈ విషయాన్ని తీసుకెళ్లాం.

– దేవేంద్రరావు, ఎంఈఓ, మెళియాపుట్టి



అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని కంచె వేసిన దృశ్యం

అధికారులు పట్టించుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించి కంచె వేయడం సరికాదు. స్థలం మాదని వారు మొండివైఖరితో వ్యవహరిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– లండ వెంకటరావు, మురుకుంటిభద్ర, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

కంచె వేయడం వాస్తవం

కంచె వేయడం వాస్తవమే. అంగన్‌వాడీ భవనం తీసేయమని నన్నెవరూ ఇబ్బంది పెట్టలేదు. స్థలం మాత్రం వారిదే అని కొంతమంది గ్రామస్తులు చెబుతున్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయితే వెళ్లిపోమంటున్నారు. అప్పటివరకు ఇక్కడ కేంద్రం నిర్వహించుకోవాలని చెబుతున్నారు.

– ఎం.భారతి, అంగన్‌వాడీ టీచర్, మురుకుంటిభద్ర

స్థల పరిశీలన చేస్తాం

ఈ విషయాన్ని ఎంఈఓ దేవేంద్రరావు నాకు తెలియజేశారు. అక్కడికి వెళ్లి పరిశీలించాలని విలేజ్ సర్వేయర్‌కు అప్పజెప్పాను. డీఎల్ఆర్ విలేజ్ సర్వే వలన పరిశీలించలేకపోయాం. రెండు రోజుల్లో గ్రామానికి వెళ్లి పరిశీలన చేస్తాను.

– శ్యామలరావు, మండల సర్వేయర్, మెళియాపుట్టి

థర్మల్ ప్లాంట్‌తో పర్యావరణానికి విఘాతం



థర్మల్ వ్యతిరేక పోరాట సభ జెండాను ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ ప్రతినిధులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో థర్మల్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తే పర్యావరణం పూర్తిగా నాశనమై మానవాళి మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, కోశాధికారి అత్తులూరి రవికాంత్ అన్నారు. ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న థర్మల్ వ్యతిరేకపోరాట బహిరంగ సభకు సంబంధించిన జెండాను అద్దూరుపేట వద్ద శనివారం ఆవిష్కరించారు. పవర్ ప్లాంట్‌ను పూర్తిగా తరిమికొట్టే వరకు అవిశ్రాంత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పంట పొలాలు పత్ర హరితానికి గుర్తుగా పచ్చనిరంగు, వ్యవసాయం సాగుచేస్తున్న చిహ్నం ద్వారా జెండాను తయారు చేసినట్లు వెల్లడించారు. అద్దూరుపేట వద్ద నిర్వహించనున్న థర్మల్ వ్యతిరేకపోరాట సభను జయప్రదం కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కార్యదర్శి సవర సింహాచలం, సభ్యులు లక్ష్మణ్, ఆరిక ప్రసాద్, సవర కురమయ్య, నాగేష్, చుక్కయ్య, కాంతయ్య పాల్గొన్నారు.

22 నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్



జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల్లో బంద్ గురించి తెలియజేస్తున్న సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: ఫీజురీయింబర్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీ నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను బంద్ పాటిస్తున్నామని విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు కోరారు. శనివారం నరసన్నపేటలో ఉన్న అన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు యాజమాన్య ప్రతినిధులు వెళ్లి విద్యార్థులకు బంద్ విషయాన్ని వివరించారు. గడిచిన రెండేళ్లుగా డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలకు ఫీజురీయింబర్స్ నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నా పట్టించుకోవడ లేదని సి.హెచ్.దుర్గాప్రసాద్, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బకాయిలు చెల్లించకపోవడంతో అధ్యాపకులకు జీతాలు, భవనాల అద్దెలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నామన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ చర్యకు ఉపక్రమించామన్నారు. జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు జారీ చేయాలి

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డులు సత్వరమే జారీ చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయ ఆవరణలో మాట్లాడారు. కొత్తగా ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు కనీసం మూడు నెలల సమయంలో హెల్త్ కార్డులు జారీ చేయడం జరగడం లేదని, చాలామంది పెన్షనర్లకు ఆరోగ్య సేవలు అందక మృతి చెందిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. హెల్త్‌కార్డులు ఉన్నవారందరికీ కార్పొరేషన్ వైద్యశాలల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. వివిధ వ్యాధులకు ప్యాకేజీ రేట్లు సవరించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు సత్వరమే చెల్లించాలని కోరారు. సంఘ కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



జలుమూరు: రామయ్యవలసలో యోగి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు



సరుబుజ్జిలి: సిమ్మయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

జలుమూరు: మండలంలోని రామయ్యవలసకు చెందిన కొర్ను యోగ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. బసివాడలో పొన్నాన రూపావతి మృతి చెందారు. ఆ కుటుంబ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, నాయకులు ధర్మాన జగన్, బుడ్డల శ్రీనివాసరావు, శిమ్మ నాగేశ్వరరావు, మోహన్, రెడ్డి అప్పారావు, సోమినేని జయరాం, కృష్ణ, కొర్ను రాజు, తదితరులు ఉన్నారు.

సారవకోట మండలంలో..

సారవకోట: మండలంలోని బెజ్జి గ్రామానికి చెందిన వాడవలస ఇందిరమ్మ, మూల అప్పలనరసమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. జమచక్రం గ్రామానికి చెందిన బటాన సింహాచలం మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, లక్ష్మీపురం గ్రామానికి చెందిన గేదెల తవిటయ్య మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, ఇప్పిలి షణ్ముఖరావు, కొండాల బాబూరావు, పార్టీ నాయకులు మెండ వైకుంఠరావు, రెడ్డి పాపయ్య, పోలాకి కేశవ, మజ్జి అప్పన్న, జాడ లక్ష్మణరావు, మెండ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సరుబుజ్జిలిలో..

సరుబుజ్జిలి: మండలంలో ఇటీవల పలు గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. మతలుబపేటలో సనపల నారాయణరావు, చిగురువలసలో నేతింటి సిమ్మయ్య, రొట్టవలసలో నాగరాజు మృతి చెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కిల్లి వెకంట గోపాల సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, అత్తులూరి రవికాంత్, వీరఘట్టపు కృష్ణ, మూడడ్ల రమణ, కుసుమంచి హరీష్ ఉన్నారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట గ్రామానికి చెందిన ఎన్ని త్రిమూర్తులు ఇటీవల మృతి చెందారు. మృతుని కుమారుడు గోవిందరావును పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన పేడాడ సుధ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి : మర్రిపాడు-సి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. డేగలపోలూరు గ్రామానికి కుచెందిన బాలరాజు, ముకుందాపురం గ్రామానికి చెందిన పి.చరణ్ శనివారం కూలి పనులకు వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి చేరే క్రమంలో మర్రిపాడు-సి గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయారు. గాయపడిన ఇద్దరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యసేవలు అందించడానికి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

అక్షరాస్యతతోనే ఆత్మవిశ్వాసం

ఆమదాలవలస: అక్షరాస్యతతోనే మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సంబంధించిన బ్రోచర్, పుస్తకాలను ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ పరిధిలో 1,200 మంది మహిళలను గుర్తించామన్నారు. వారికి చదవడం, రాయడం నేర్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. 120 మంది మహిళా సభ్యులను ట్రైనర్లుగా ఎంపిక చేసి ఒక్కో ట్రైనర్ 10 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు అవసరమైన బోధనా పద్ధతులపై మాస్టర్ ట్రైనర్ బి.రమేష్ మార్గదర్శకత్వంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించామన్నారు. మెప్మా టీఎంసీ ఎస్.వి.రత్నం, మెప్మా సీఓలు నాగమణి, వినోద్, ఆర్పీలు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరి

పాతపట్నం: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. మండలంలోని స్టువర్టుపేట గిరిజన గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని శనివారం ఏడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఆరు నెలలకు పైబడిన ప్రతి పశువుకూ ఈ టీకాలు వేయించాలని, చూడి ఉన్న పశువులకు కూడా ఈ టీకాలు వేయించవచ్చన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. పాతపట్నం మండలంలో 10,100, మెళియాపుట్టి మండలంలో 12,000 పశువులకు టీకాలు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొపాలమిత్ర వల్లభరావు, జగదీశ్వరరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు నరసన్నపేట విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 18 మంది విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. మండలం, డివిజన్ స్థాయిల్లో జరిగిన పోటీల్లో వీరు ప్రతిభ చూపారు. కేఆర్ స్టేడియంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌తోపాటు అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపారని పీడీలు ఎం.వి.రమణ, గణపతిరావు తెలిపారు. వీరికి శనివారం స్కూల్ ఆవరణలో హెచ్ఎం వెంకటరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న మండపాలు, విగ్రహాలు



పైడితల్లి ఆలయం వద్ద దేవీ విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కొల్‌కతా బృందం సభ్యుడు



కార్ స్టాండ్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన మండపం

నరసన్నపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒకవైపు మండపాలను నిర్వాహకులు సిద్ధం చేస్తుండగా.. మరోవైపు విగ్రహాలకు శిల్పిలు తుది మెరుగులు దిద్దుతున్నారు. సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఆదివారం అమావాస్య కావడంతో శనివారమే విగ్రహాలను మండపాల వద్దకు తరలించారు. స్థానిక జై దుర్గా భవాని టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా కార్ స్టాండ్ ప్రతినిధులు ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే చుట్టూ, పరిసరాల్లో విద్యుత్ అలంకరణ పూర్తిచేశారు. మండపాన్ని సిద్ధం చేశారు. ఉర్లాం మార్కెట్ కూడలి వద్ద దేవీ నవరాత్రుల నిర్వహణకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. మాకివలస, మడపాం, వీఎన్‌పురం తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు కోల్‌కతా నుంచి వచ్చిన శివ బృందం సభ్యులు స్థానిక పైడితల్లి ఆలయం వద్ద విగ్రహాలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభానికి ఒక్కరోజే ఉండటంతో దేవి విగ్రహాలకు శిల్పిలు తుది మెరుగు దిద్దుతున్నారు. నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 వ తేదీ నుంచి అక్టోబరు రెండో 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. స్థానిక శాంతామణి, పైడితల్లి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు.



సిద్ధమైన విగ్రహాలు

విశ్వకర్మకు ప్రత్యేక పూజలు



ఆమదాలవలస: విశ్వకర్మ పూజల్లో పాల్గొన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట: విశ్వకర్మకు పూజలు చేస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలో విశ్వబ్రాహ్మణులు ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం దర్శించుకున్నారు. ఆమదాలవలసకు చెందిన విశ్వబ్రాహ్మణులు ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, కుప్పిలి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సిల్లా మల్లికార్జునరావు, జె.కె.కౌశిక్, కటకం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: స్థానిక బండి, తెలగ వీధుల్లో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆయా మండపాలను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శనివారం సందర్శించి విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కృష్ణదాస్ తీర్థప్రసాదాలు అందించారు. ఎంపీపీ ఆరంగి మురళి, చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, ఆర్. శ్రీధర్(బుజ్జి), ముద్దాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ఆరా



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఆర్డీఓ సాయిప్రత్యూష



శ్రీముఖలింగంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రవిబాబు

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం, కరకవలస ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈఓ ఎ.రవిబాబు శనివారం పరిశీలించారు. పాఠశాలల్లోని మౌలిక వసతులపై ఆరా తీశారు. విలువలతో కూడిన విద్య వల్ల విద్యార్థులు మానసికంగా వృద్ధి చెందుతారన్నారు. డిప్యూటీ ఈఓలు విజయలక్ష్మి, విలియం, తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ చిన్నమ్మడు, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష అన్నారు. కొండపోలవలస ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులకు పలు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలను అడిగారు. మిడ్డే మీల్స్ నిర్వహణ, మెనూ కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మొక్కలు నాటారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు అన్నారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. పలుచోట్ల మొక్కలునాటారు. వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాల్లో పలుశాఖల ఉద్యోగులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలం రావిచంద్రిలో మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా



బూర్జ: బూర్జలో మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు, ఉద్యోగులు



ఆమదాలవలస: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ టి.రవి, ఉద్యోగులు, విద్యార్థులు



పాతపట్నం: కాగువాడలో చెత్తను ఊడ్చుతున్న ఎమ్మెల్యే గోవిందరావు



మెళియాపుట్టి: మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ కిశోర్‌కుమార్, అధికారులు